
# ఈ వారం కథ



# పయనించే ఓ చిలుకా...

— సంకా ప్రసాద్

"తాతయ్యా నువ్వు చచ్చిపోతావా?"

బెడ్ మీద తల దగ్గర కూర్చొని కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తూ అడిగింది, ధర్మారావు మనుమరాలు—అతని ప్రాణానికి ప్రాణం.

చనిపోవటం అంటే ఏమిటో ఆ పసిపిల్లకు అవగాహనలేకపోయినా—ఒళ్ళో కూర్చోబెట్టుకొని కథలూ కబుర్లూ చెప్పే, సాయంత్రం కాగానే పార్కుకి తీసుకు వెళ్ళే ఈ ముసలి స్నేహితుని కోల్పోతున్నానని మాత్రం తెలుసు.

నాలుగేళ్ళయినా నిండని లేత కళ్ళలోంచి ముత్యాల్లా రాలిన కన్నీటి చుక్కలు తాతయ్య చెంపల మీద పడి ఏడాదిలో పగుళ్ళొచ్చిన నేల మీద పడ్డ వర్ష బిందువుల్లా పడీ పడక ముందే కరగిపోయాయి.

డెబ్బై అయిదేళ్ళుగా లోకంలో మంచినీ చెడునీ, సుఖాన్నీ దుఃఖాన్నీ, చావునీ బ్రతుకునీ, చూసి చవిచూసి 'ఇక చాలు బాబో' అన్నట్లు చూడలేక కుంచించుకుపోతున్న అతని కళ్ళలోంచి బయటకు రాబోయిన కన్నీటి చుక్కలు ఆ శ్రమ కూడా పడలేక కళ్ళలోనే నిలిచిపోయాయి.

కిటికీ అవతల వున్న చెట్టు నుంచి సన్నని గాలికి రాలి పడుతున్న పారిజాత పుష్పాల వాసన అతని నాసికా పుటాల దగ్గర ఆగిపోయింది.

"ఏయ్ రాక్షసీ. తెల్లవారిందగ్గర్నుంచీ వెతుకుతూంటే ఇక్కడున్నావా? తాతయ్య దగ్గరకు వెళ్ళొద్దని చెప్పానా" అంటూ ఎవరో—వాళ్ళమ్మ కాబోలు—ఆ పసిపిల్లను లాక్కెళ్తున్నారు.

ప్రాణం విలవిల్లాడింది. అతనికి కళ్ళలో మళ్ళీ కన్నీరు గిర్రున తిరిగి కరగిపోయాయి.

మనుమరాలు వెళ్ళిపోయినా ఆ పిల్ల అడిగిన ప్రశ్న మాత్రం ప్రాణం వీడిన శరీరంలా అలానే వుండిపోయింది.

"మింగు, దిగ్రమింగు, ఇది తప్పదు.. ఇప్పుడేం చేయగలవ్. పుట్టిందగ్గర్నుంచీ ఈ సత్యం వెంటాడ్టం లేదా? ప్రత్యక్షంగా ఎదుర్కోన వలసిన భయంకర సత్యం. మృత్యువు భరించు" వేరెవరూ లేని ఆ గదిలో అతని అంతరంగమే అతనితో గొణుగుతోంది.

తన తండ్రి చిన్నపుడే పోయాడు.

తల్లి దీర్ఘరోగంతో మూడు నాలుగు సార్లు భయపెట్టి చివరకు భయంకరంగా చచ్చిపోయింది.

ముప్ఫై అయిదేళ్ళ తమ్ముడు ఏక్సిడెంట్‌లో దుర్మరణం పాలైనపుడు మృత్యువు కఠోరంగా తన ఉనికిని నిరూపించింది.

చేదు నిజాలు!

గుంభనంగా దిగమింగాడు.

అంతదాకా ఎందుకు?

ఎన్నిసార్లు—తనకే—

క్విట్టిండియా ఉద్యమంలో కాలేజీలో బ్రిటిషు వాడి లాఠీ దెబ్బ వెన్నెముక మీద తగిలి క్రింద పడ్డపుడు—

పెళ్ళయిన కొత్తలో రైలు పట్టాలు తప్పి ఏట్లో పడిపోతే అతి కష్టం మీద ఒడ్డుకు యీదుకుని వచ్చినపుడు—

స్కూల్లో రోజులాగే పాఠం చెప్పటానికి మెట్లెక్కిపోతూన్నపుడు జారిపడి మూడు నెలలు హాస్పిటల్‌లో వున్నపుడు—

ఒక్కొక్క రోజా గడిచేకొద్దీ ఆయువు తగ్గిపోతూనే వుందన్న సత్యాన్ని తను మర్చిపోతాడేమోనని క్రమం తప్పకుండా మృత్యువు తన ఉనికిని నిరూపిస్తూనే వుంది. అసలే క్షణికమైన జీవితాన్ని అనుక్షణం ఛాలెంజ్ చేస్తూనే వుంది.

అయితే ఆ సాహసాల్లో, ప్రమాదాల్లో తను గెల్చాడు. భవిష్యత్ ప్రపంచాన్ని ధైర్యంతో ఎదుర్కొంటానికి గుండె దిటవు చేసుకున్నాడు.

కాని జీవితపు మలి సంధ్య కొన వెలుతురులో తన నీడ వెనక్కి పెరిగి పెద్దదై మృత్యువౌతున్నపుడు—డెబ్బై అయిదేళ్ళ తను ఏ భవిష్యత్ కోసం ఎదురు చూడాలో తెలియక అతని గుండె తడబడుతోంది.

"ఇదుగో ధర్మం! డెబ్బై అయిదు వసంతాలు చూశావ్. నీకేం తక్కువైంది. ముగ్గురబ్బాయిలు మంచి ఉద్యోగాల్లో వున్నారు. అమ్మాయిని ఉన్నింటి పిల్లను చేశావ్. ఏవో ఆ కాయలకు తలో రెండు కాయలు!

నాలుగు రాళ్ళ వెనకేశావ్. ఆ భగవంతుడు న్నాడు. వాణ్ణి స్మరించుకో. హాస్పటల్ నుండి తీసుకొచ్చారని మా వాడు చెబితే వెంటనే బయలుదేరి వచ్చాను. నాకూ ఉబ్బసం, కీళ్ళ నొప్పులూ, వయసు మీద పడుతోంది గదా. వస్తాను''

ఆ మాటలు అలా విన్పించటం లేదు.

''ఇదుగో ధర్మం! డెబ్బై అయిదేళ్ళు బ్రతికావుగా. ఇంకా ఏం కావాలి? అలా ఏడుపు ముఖం పెడతావెందుకు? పిల్లల్ని కన్నావ్. వాళ్ళకీ పిల్లలు పుట్టారు. బాగా సంపాదించావ్. ఇంత మందికి భారంగా వుండకపోతే ఇక చావ రాదూ? అయినా పోయేవాడివి—నీతో నేనూ రాలేనుగా, వస్తాను''

అందరూ యిదే వరస—

''గురువుగారు యూరోపియన్ హిస్టరీ చెబుతూంటే క్లాసులో పిన్‌డ్రాప్ సైలెన్స్ వుండేది. ఎంతో ఉద్రేకంగా గంటసేపు ఏకధాటిగా లెక్చరిచ్చేవారు. అలాంటివారు ఇలా చావు బ్రతుకుల మధ్య...''

''ఎక్కడ పెళ్ళి జరిగినా ధర్మం బాబాయి వున్నాడంటే మాకెంతో ధైర్యంగా వుండేది. నడుంకు తువ్వాలు బిగించి నిలబడ్డాడంటే, రెండు వైపుల వారూ ఆయన చెప్పినట్లు వినవలసిందే. డెబ్బై అయిదేళ్ళు రాయిలా వున్నాడు. ఉక్కు శరీరం గాబట్టి ఇన్నాళ్ళయినా...''

''మాడు వరమ్మా! నువ్విలా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే పిల్లలు మరీ దిగులు పడరూ, మహానుభావుడు. తన పని తను చేశాడు. భగవంతుడి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది. చివరి క్షణాల్లో ఆయన్ని ప్రశాంతంగా ఉంచటం నీ ధర్మం''

ఇలా అందరూ తనను పోయినట్లుగానే భావిస్తున్నారేమిటి? తన పని నిజంగానే అయిపోయిందా? అందరూ కలిసి అపుడే తన ఎపిటాఫ్ రాసేస్తున్నారే.

వరం ఏదీ?

''వరం?'' గొంతులోంచి మాట రావట్లేదు.

ముఖం కడుక్కుని స్నానం చేసి వస్తానని వెళ్ళింది.

ఇంకా రాదేం?

ఇరవై నాల్గుగంటలూ తన ప్రక్కనే కూర్చొని వుందిగా?

విశ్రాంతి తీసుకొంటూందేమో?

ఏభై ఏళ్ళ సంసార జీవితం!

విసిగిపోయిందా?

'భార్యా బిభ్యతి తస్మిన్‌కాయే' అంటే ఇదేనా కాలం గడవట్లేదా...'

పిల్లలు...

చదువులు...

పెళ్ళిళ్ళు...

జ్ఞాపకాలు

## ''లీడర్'' సంపాదకుడు

తెలుగువాడైన సి.వై.చింతామణి (చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి) ఆనాటి ప్రముఖ పత్రిక ''లీడర్''కు సంపాదకులుగా వుండేవారు. ''లీడర్'' పత్రిక యాజమాన్య సంఘానికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడు. కానీ చింతామణి మోతీలాల్ నెహ్రూను తీవ్రంగా విమర్శిస్తూ సంపాదకీయాలు వ్రాశాడు. మోతీలాల్‌కు కోపం వచ్చింది. తానే ఆ పత్రిక యజమాన్యం నుంచి తప్పుకున్నారు.

మరోసారి ''లీడర్'' నిర్వహణాధ్యక్షుడైన పండిత మదన్‌మోహన మాలవ్యాను అదే పత్రికలో విమర్శించాడు చింతామణి. అందుకే చింతామణి రాజీనామా చేయబోయాడు.

''నేను లేకపోయినా పర్వాలేదు. కానీ చింతామణి ఎడిటర్‌గా లేకుంటే ''లీడర్'' పత్రికను ఊహించలేం'' అంటూ మదనమోహనమాలవ్యాగారే తప్పుకున్నారు. ఎంత సాహస సంపాదకుడో గదా చింతామణి.

డాక్టర్ మల్లిప్రియ ''నాగరాజు''

వాళ్ళకు పిల్లలు

ఎల్లకాలం అలాగేనా?

''అమ్మ ఎపుడూ ఇక్కడే వుంటే ఎలా నాన్నా''

'పశ్యా జీవతి జర్జర దేహే

వార్తాం కోపి పృశ్చతి గేహే'

అవును...

ఇక తనది కొద్దిలో పోయే ప్రాణమేగా?

''వరం?''

దేవుడి దగ్గర పసుపు కుంకుమ నిలుపమని ప్రార్థన చేస్తోందా?

ఎంతకాలం నిలుపుతాడు?

ఎందుకు నిలపడు?

డెబ్బై అయిదేళ్ళకే అయిపోయిందా?

మురార్జీ, రంగా అందరూ ఆరోగ్యంగా లేరూ?

మురార్జీ మెట్లెక్కుతూంటే కుర్రవాళ్ళకంటే వేగంగా ఎక్కుతాట్ట!

మొన్నకి మొన్న ఎనభై దాటిన బిస్మిల్లా ఖాన్ షెహనాయీ ఎంత బాగా వాయించాడు? ఇంకా వందేళ్ళు బ్రతగ్గలడన్న ఎబిలిటీ!

లతకీ, సుబ్బులక్ష్మికీ అసలు వృద్ధాప్యం వచ్చిందా?

అంత దాకా ఎందుకూ? ప్రక్కింటి చారి లేడూ. కమ్యూటెడ్ పెన్షన్ రెస్టోర్ అయి పదేళ్ళ ఎరియర్స్ తీసుకొన్నాడు. ప్రభుత్వం బావురుమని ఏడ్చేట్టు ఇంకా ఇరవై ముప్పై ఏళ్ళు బ్రతికేట్టు వుంటాడే.

తను కూడా—

పదిహేను, ఇరవై ఏళ్ళ వయసు నుంచే యోగా చేసి వుంటే ఎలా వుండేదో? అల్లోపతీ కాకుండా ఆయుర్వేదం, హోమియో—ఏమో—

సర్జరీ, స్కానింగ్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఏవైనా—

ఒక్క సంవత్సరం చాలు

ఇంకా ఒక్క సంవత్సరం!

బ్రతకాలి

ఈ ప్రపంచంలోని విచిత్ర వ్యక్తుల్నీ, వారి బాధల్నీ సంతోషాల్నీ చూసి పాలుపంచుకుని తనలో తానే నవ్వుకొన్న తను ఒక్కసారిగా ఈ సుందర స్వప్నాన్ని వదిలి...

లేదు. బ్రతకాలి. కొన్ని నెలలైనా—

''అది కాదురా అన్నయ్యా. ఈ డాక్టరు లాభం లేదన్నాడుకాని, మద్రాసు అపోలోలో అయితే స్పెషల్ ఎక్విప్‌మెంటు వుందిట. ఫారిన్ రిటర్న్డ్ స్పెషలిస్టులు కూడా వున్నార్ట.''

''కాని అక్కడకు పోయినా పూర్తిగా నయం అవుతుందంటే చేయించవచ్చురా. శరీరం బాగా వాడి పోయిందాయె. మూత్ర పిండాలు చాలా కష్టం. పైగ అక్కడ అన్ని వసతులూ వెంటనే దొరకాలి.''

''అదేముందిలే మీ బావమరిది చేత చెప్పిస్తే సులభంగా తక్కువ ఖర్చులో...''

''మళ్ళీ అతన్ని బ్రతిమాలాలి. ఏదైనా పోనీ శాశ్వతంగా తగ్గిపోయేట్లుంటే ప్రయత్నించవచ్చు. అదయినా ఆరు నెలలో సంవత్సరమో అంటున్నారుగదా. అదే నాకూ తోచటం లేదురా. నా శెలవూ ఈ రోజుతో అయిపోతుంది. మళ్ళీ బడ్జెటూ అదీ మినిస్ట్రీలో సెలవు దొరకదు. ఏమిటో అమ్మా— నువ్వేమంటావ్?''

తన వాళ్ళంతా ''ఇక నీ అవసరం ఏమిటి?'' అని ఏకధాటిగా ప్రశ్నిస్తున్నట్లుగా వుంది.

మొదట్లో వినపడగూడదనే మాట్లాడుకొనే వారు. తర్వాత వినపడగూడదని మాట్లాడుకుంటున్నట్లే మాట్లాడుకొనేవారు. ఇపుడు తను విన్నా పట్టించుకోనట్లే మాట్లాడుతున్నారు.

''ఒరేయ్. ఇది నా ప్రాణంరా. నేను ఇంకా బ్రతికే వున్నాన్రా. మీరు కాదురా నిర్ణయించాల్సింది.

మద్రాసు కాదు, అమెరికా అయినా సరే,

సంవత్సరం కాదు ఒక్క నెలయినా సరే ఇది నా ప్రాణంరా''

అవి గట్టిగా అరిచి చెప్పటానికి ఓపికే కాదు అహం కూడా అడ్డు వస్తోంది.

తన జీవితంలో ఎన్నో రాజీలు పడ్డాడు గాని ఇతరుల జాలికి పాత్రుడు కావలసిన స్థితి ఎపుడూ రాలేదు.

తండ్రికి గర్వకారణమైన కొడుకుగా ప్రేమానురాగాల్ని పంచియిచ్చిన భర్తగా బాధ్యతాయుతమైన తండ్రిగా విద్యార్థులకు ఆదర్శ ఉపాధ్యాయుడిగా కీర్తింప బడిన తను ఎవరి దగ్గరా తలవంచలేదు.

''స్పెషల్ ట్రీట్‌మెంట్ చేయిస్తే ఇంకొక ఆరు నెలలు గడపవచ్చు. కాని దాదాపు లక్ష రూపాయిలకు పైగా ఖర్చవుతుందట. ఏమంటావ్ అమ్మా?''

''వరం! మాట్లాడు! ఊ! ఆరు నెలలు ఆరు యుగాలుకాదా. ఇంతకంటే నీకేం కావాలి, ఊ''

అతని మాటలు గొంతు దగ్గరే ఆగిపోతున్నాయి. పైకి రావటం లేదు.

ఇంకొక ఆరు నెలల్లో పోయే ప్రాణానికి కాపలా అంతేగా—

''వరం!''

''ఇన్నాళ్ళ నా సాంగత్యం ఈ భయంకర మౌనాన్నేనా నీకు నేర్పింది? మాట్లాడవేం?''

సర్వ ప్రపంచానికీ, చివరికి భార్యకి కూడా బాధ, బరువు, ఎక్స్‌ట్రాగా తను మిగిలి పోతున్నాడా?

* * * ''మళ్ళీ నాల్రోజుల్లో వస్తాన్నాన్నా. ఏం ఫరవాలేదు. మళ్ళీ స్పెషలిస్ట్ వస్తాట్ట. కొద్ది రోజుల్లోనే కోలుకొంటావని డాక్టరు చెప్పారు. అమ్మా చెల్లాయీ ఇక్కడే వున్నారు'' మెల్లగా దగ్గరగా వచ్చి చెప్పాడు పెద్దకొడుకు.

కొడుకుగా ప్రేమనీ బాధ్యతనీ పంచుకోవటం నుంచి తండ్రిగా, భర్తగా, తన సంసారానికి అనురాగాన్ని, మమకారాన్ని పంచి యివ్వవలసిన జీవితపు ఆవలి తీరంవైపు పయనిస్తున్న మధ్య వయస్కుడతను.

గిర్రున తిరుగుతున్న కన్నీటిని వెనక్కి తిరిగి తుడుచుకొంటూ అతను వెళ్ళిపోతున్నాడు. అతని వెంటే అతని చిన్నారి కూతురు—తన మనుమరాలు—అమాయకపు కళ్ళతో వెనక్కి చూస్తూనే ముందుకు వెళ్ళిపోతోంది, తన ప్రశ్నకి సమాధానం గ్రహించినట్టు.

పెద్ద వాడి వెనక రెండోవాడు—

వాడి వెనక మూడో వాడు—

అందరూ వెళ్ళిపోతున్నారు—

పైకి లేవబోయాడు

అశక్తమైన అతని శరీరం అతని చేతనను నిర్వీర్యం చేస్తోంది.

వెనక్కి వాలిపోయాడు. ■



# మీ దృష్టిలో..

## * కందకు లేని దురద



''పక్కింట్లో కూర మాడిపోతున్నదని పరుగెత్తే ఇల్లాలు!''
- ప్రగళ్ళపాటి తేజకుమారి, ఏలూరు



''ఇంటి నిండా చుట్టాలు వున్న రోజున పనికి వచ్చే పని మనిషి!''- సురేఖ సింం, రామకృష్ణాపురం




''పక్కింటి అల్లుడికి మర్యాదలు చేసే దంపతులు!''
- బి. భాగ్యశ్రీ, కిష్టాపూర్



''అడక్కుండానే కొసరు వేసే వ్యాపారి!''
- కె. రామకృష్ణ, కొల్లురు



''నిర్మాతకు లేని శ్రద్ధ లైట్ బాయ్ ప్రదర్శించడం!''
- జి. శ్రీనివాసరావు, కాశీబుగ్గ



''అమ్మగారిని అయ్యగారు తిడితే పనిమనిషి ఎక్కిఎక్కి ఏడ్వటం!''
- ఎం. వంశీ శ్రీనివాస్, కొత్తగూడెం



''నిర్మాత సినిమా రిలీజు చేయలేకపోతున్నాడని డిస్ట్రిబ్యూషన్ పెట్టే హీరో!''
- వి. వసంత, సూళ్ళూరుపేట



''ఫీజు లేకుండా, ఉచితంగా మందులు కూడా ఇచ్చే డాక్టరు!''
- కె. సరోజ, హైదరాబాద్




''క్రికెటర్ సరిగా ఆడకపోతే అభిమాని తిండి మానటం!''
- మంగం రామారావు, కేదార్లంక



''ఇల్లు అద్దెకు ఇచ్చిన ఓనరు సామాన్లు కూడా సర్దిపెట్టడం!''
-జి. రఘునాథ్‌రెడ్డి, బేగుంట



''తన జేబు డబ్బుతో పెట్రోలు పోసి యజమాని కారు నడిపే డ్రైవరు!'' జి. శ్రీశైలం, ఐ.డి.పి.ఎల్



''వాడికి లేని బాధ నీకు దేనికి అని!''
- బి. శ్రీనివాస్, విజయవాడ



''రైల్వే కూలి దగ్గర సామాన్లు అందుకుని మోసేవాడు''
-తాతారాయుడు, ఎల్లారెడ్డిగూడ



''బ్యాంకు తాళాలు సరిగా వున్నాయో లేదో లాగి చూసే కష్టమరు''
-పి.వి.ఎస్. అప్పాజీ, తాటిపాక



''ఉమ్మడి సంసారంలో పనివాడు అంతా నాదే అనుకోడం!''
- బక్షి శ్రీధర్‌రావు, నరసింగాపురం



''గాడిద-కుక్క కథలో కుక్క పని గాడిద చేయడం!''
-ఆర్తి రవికుమార్ యాదవ్, అత్తిలి



''బాబోయ్ పెళ్ళికి ఎన్ని విస్తరాకులో అని బాధపడే కాకి!''
- ఎం. జనార్దనాచారి, పెందుర్తి



''ఎవరి తీటనో తనకు అంటించుకోడం!''
- లక్ష్మణ్, గోదావరిఖని



''ఉతికేవాడికి లేని శ్రద్ధ ఇస్త్రీ చేసేవాడికి దేనికి అని'' - వై.వి.వి. సత్యనారాయణ, లోల్ల



''తన సినిమా పోతే పోయింది. హీరోకు నెక్స్ట్ సినిమా వుంటుందా అని ఆలోచించే నిర్మాత!'' రమణమూర్తి అమలాపురం



''వీధిలో ఏం జరిగినా ముందుగా పరుగెత్తేవాడు!''
- దాసరి వెంకటేశ్వర్లు, ఇల్లందు.



''పార్టీ అధ్యక్షునికి లేని బాధ కార్యకర్తకి వుండడం!''
- శ్రీపాద శ్రీనివాస్, బొబ్బిలి



''దురద లేని కంద కోసినా కత్తికి దురద రావటం!''
- బి. రాజేందర్, నాయుడుపేట



''అన్నీ పోతున్నాయని ఇంటి కుక్క బాధ పడడం!''
-ఎం.ఎ.వి. రెడ్డి, డాబ్‌లా క్యాంపు



''నెక్స్ట్ పిక్చర్ తీయలేకపోతే టెక్నీషియన్స్ ఏమైపోతారో అనిబాధపడే నిర్మాత!''
- మంగం రామారావు, కొత్తపేట



''రిక్షాలో కూర్చుని, రిక్షావాడి కాళ్ళు చూస్తూకూర్చోడం!''
- అల్లు వెంకటరమణ, సరాయివల్స



''ఎంక్వయిరీలో కూర్చునే పెద్దమనిషి స్వభావం!''
-వి. రాంబాబు, తాటిపాక



''ఇల్లు ఎక్కడ అంటే సామాను మోసి మరీ చూపించే దానయ్య!''
-ఎ. ఆలీసాబ్, రాయదుర్గ



''అమ్మాయి ఫెయిల్ అయితే మమ్మీ డాడీ ఏడవడం!''
- ఎం. బ్రహ్మయ్య, పాల్వంచ



''సంఘాన్ని గురించి కొంతమంది పోలీసుల ప్రవర్తన!''
- కే. నాగేశ్వరరావు, గాజువాక

***ఈ వారం ప్రశ్న! కాళ్ళ బేరం అంటే?**

● పత్రిక మీ చేతి కందిన వెంటనే ఈ ప్రశ్నకి సమాధానంతోపాటు మీ ఫోటోను కూడా పంపిన యెడల ప్రచురించగలం.